

సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవాసమితి ప్రచురణ)

సంపుటి : 13 నవంబర్, 2016 సంచిక : 6

**సంస్థాపకులు :**
**శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీవారు**

**సంస్థాపక సంపాదకత్వం :**
**శ్రీ మాతా శుకవాణి**

**ప్రధాన సంపాదకత్వం :**
**బ్రహ్మచారి శ్రీ సాయి రామచైతన్య**

**ప్రచార సారథ్యం**
**శ్రీ ఎం. సత్యనారాయణ** M.Tech

**ప్రత్యేక సహకారం**
**శ్రీ వి.వి. కృష్ణారావు (సాయిశ్రీ ప్రింటర్స్)**

**సాయివాణి చందా వివరాలు**
ద్వైవార్షిక చందా.......... రూ॥ 160/-
ఆజీవ సభ్యత్వం .......... రూ॥ 800/-

**చిరునామా :-**

**సాయివాణి**

C/o **శ్రీ సాయీ సేవా సమితి ట్రస్టు**
సాయిధామం, రామలింగంపల్లి(పోస్టు),
బొమ్మల రామవరం మండలం,
నల్గొండ జిల్లా - 508 126.
**Ph : 9440413455, 9848133565**

E-mail : saidhamam.seva@gmail.com, saidhamam.ram@gmail.com

**విషయసూచిక** **పుట సంఖ్య**

మా వాణి ........ 2
అమ్మకు అశ్రు నివాళి ........ 4
ఆనందం ........ 5
లేఖావాణి ........ 9
మన పెద్దలిచ్చిన చద్దిమూటలు. 12
గజానన విజయం ........ 13
సాకోరీ మహర్షి ........ 16
షిరిడీ డైరీ ........ 19
గురువుగారితో కబుర్లు ........ 23
మాతృసంస్థ కబుర్లు ........ 24
క్షణాలతో పందెం వేసి ........ 26
బాలవాణీ ........ 27
జ్ఞానుల మనస్సు బ్రహ్మమే ........ 28
భక్తి కథా సుధ ........ 30







## మా వాణి



"బద్ధజీవుడు, ముక్తిని పొందాలంటే 'కామకాంచనాల'పై వ్యామోహం నుండి బయటకు రావాలి. దానికి భగవంతుని కృప తప్పక కావాలి. తీవ్ర వైరాగ్యాన్ని అభ్యాసం చెయ్యాలి. తీవ్రవైరాగ్యం ఉన్నవారు ఈ సంసారంలో ఉండడమంటే ఒక లోతైన బావిలోపడి మునిగిపోతున్నట్లుగా భావిస్తారు. వారు బంధువులను విషసర్పాలుగా భావించి వాళ్ల దగ్గర నుండి పారిపోవ టానికి ప్రయత్నిస్తారు. అంతేకానీ, ముందు నా కుటుంబానికి తగిన ఏర్పాట్లు చేసిన తరువాత భగవంతుణ్ణి తలుస్తానని అనలేరు. వారికి వైరాగ్యం అంతర్వైరాగ్యం ఎంతో ఉంటుంది. ఇక మందవైరాగ్యం గలవారు 'కాలేనాత్మని విందతి' అన్నట్లు, 'దేని సమయం వస్తే అప్పడది జరుగు తుందిలే, మేము కేవలం భగవన్నామాన్ని జపం చేసుకుంటూ ఉంటాము' అని అనుకుంటారు. ఈ తీవ్రవైరాగ్యం గురించి ఒక కథ ఉంది.

"ఒకసారి అనావృష్టి వల్ల కాటకం ఏర్పడింది. చేలకు నీరు అందడం లేదు. రైతులు నదిలో నుండి కాల్వలు త్రవ్వుకొని పంటకు నీళ్ళు పెట్టుకుంటున్నారు. ఆ రైతులలో ఒకడు చాలా పట్టుదల గలవాడు. భగీరథుడిలాగా పట్టుపట్టి ఆ సాయంత్రం లోపల పొలానికి నీరు పెట్టాలను కున్నాడు. నది నుండి పొలానికి కాలువ త్రవ్వుతున్నాడు. ఎండ ఎక్కడం వల్ల స్నానానికి వేళ అయిందని భార్య, కూతురు ద్వారా కబురుపెట్టి, వంటికి గిన్నెలో నూనె పంపింది. కూతురు వచ్చి, 'నాన్నా! వంటికి నూనె రాసుకొని స్నానం చెయ్యి' అని చెప్పింది. 'ఇప్పడు కాదు, నాకు చాలా పని ఉంది. ఫో, ఇక్కడ నుంచి!' అని రైతు అన్నాడు".

"మధ్యాహ్నమైంది. సూర్యుడు నడినెత్తిమీదికి వచ్చాడు. రైతు పొలంలో

యింకా పనిచేస్తూనే ఉన్నాడు. స్నానం మాటే మరచిపోయాడు. ఇంతలో అతడి భార్య పొలానికి వచ్చి, 'ఇంకా స్నానమే చెయ్యలేదు. వండిన వంట చల్లారిపోతున్నది. నీకు ఏ పని పట్టుకున్నా ఒళ్ళు తెలియదు. మిగిలిన పని రేపుగానీ, భోజనం తరువాతగానీ చెయ్యవచ్చులే. ఇంటికి రా!' అన్నది. రైతు ఉగ్రుడై చేతిలో పలుగు పట్టుకొని ఆమె మీదికి పరుగెడుతూ యిలా గద్దించాడు : 'ఏమిటే! నీకు బుద్ధి లేదా! వానలు లేక పొలం ఎండిపోతున్నది, యిదే పరిస్థితి కొనసాగితే, పిల్లలకు ఏం పెడతావు? మీరంతా ఆకలితో మాడి చావల్సి వస్తుంది. పొలంలోకి నీళ్ళు వచ్చేదాకా స్నానం చెయ్యను సరిగదా నీళ్ళు కూడా ముట్టను!' అని రంకెలు వేశాడు. అతడి రౌద్రాకారం చూసి భయపడి వెళ్ళిపోయింది.

"ఆ రైతు రెక్కలు ముక్కలు చేసుకొని, రోజంతా కష్టపడి సాయంకాలానికి చేనులోకి నీటిని పారించాడు. గలగలమంటూ నీరు పారడం చూచి అతడి మనస్సు సంతోషంతో నిండిపోయింది. తరువాత ఇంటికి వెళ్ళి భార్యను పిలిచి, ఒంటికి నూనె రాసుకోవడానికి నూనె, కాల్చుకోవడానికి చుట్ట ఇమ్మని అడిగాడు. తరువాత హాయిగా స్నానం, భోజనం చేసి గుర్రుపెట్టి నిద్రపోయాడు. తీవ్రవైరాగ్యానికి ఇది ఒక ఉదాహరణ".

"అక్కడే ఇంకొక రైతు ఉన్నాడు. అతడు కూడా నది నుండి పొలానికి కాలువ త్రవ్వడం ప్రారంభించాడు. ఇంతలో అతడి భార్య వచ్చి, 'పొద్దెక్కింది, ఇంటికి రా? అంత ఒళ్ళు విరుచుకుని పని చెయ్యనక్కర లేదులే' అన్నది. ఆ రైతు మారుపలుకకుండా పార, పలుగు పక్కనపెట్టి భార్యతో 'సరేలే? నీవు రమ్మంటున్నావు తప్పుతుందా? ఇంటికి పోదాం పద?' అని ఆమెతో కలిసి వెళ్ళిపోయాడు. ఆ రైతు సకాలంలో పొలానికి నీరు పెట్టలేక పోయాడు. మందవైరాగ్యం అంటే ఇలా ఉంటుంది. గట్టి పట్టుదల లేకుండా రైతు పొలానికి నీరు పెట్టలేనట్టే, తీవ్ర పరితాపం లేకపోతే భగవంతుణ్ణి కనుక్కోలేరు". ఆ తీవ్రపరితాపం మనలో నింపమని ఆ దేవదేవుని ప్రార్థిద్దాం.









# అమ్మకు అశ్రు నివాళి



అమ్మ గుర్తొస్తున్నావు, గుండెలు పిండేస్తున్నావు
మీ అస్తమయం మా మనసులు దుఃఖమయం
మీ రూపం మాకెంతో అపురూపం
మీ నిండైన కట్టూ-బొట్టూ హిందూ ధర్మానికి తొలిమెట్టు
మీరు చెప్పే ప్రతి మాట మాలోని ఎదుగుదలకు పూబాట
మీరు మాకు నేర్పినవి పాఠాలు కావు
మా జీవితాలకు గుణపాఠాలు
మా అమ్మలుకు మీరు పాడారు లాలిపాట
మరి మా జీవితాలకు లాలన ఏది?
మీకు ఎల్లప్పుడూ స్వామి కార్యమే కాని స్వకార్యము లేదు
మీరు నేర్పిన నైతిక విలువలు న భూతో న భవిష్యతి!
మీరు లేని మా జీవితం
అమ్మ కడుపులో ఉమ్మనీటిలో పడ్డ శిశువులా అల్లాడుతుంది.
మీరు కట్టించిన భారతి (గ్రంథాలయం) అడుగుతుంది
ఏది నా అభినవ సరస్వతి అని!
మీ మందిరం మదనపడుతుంది మీరు రాలేరని
కాని వీటికేం తెలుసు మీరు మాలోనే ఉన్నారని
మమ్ములను నడిపిస్తున్నారని

ఇక ఇంతే అమ్మ రాయలేకపోతున్నాం. కళ్ళు కన్నీటితో మసకబారుతున్నాయి. చేయి వణుకుతుంది. కాని మీరు చెప్పిన ప్రతి మాట మాకు తారకమంత్రమే.

ఇట్లు
మీరు నేర్పిన జ్ఞానభిక్షతో బ్రతుకుతున్న
**సాయిరమణ (సాయినాథ క్షేత్రం)**

# ఆనందం

**- శ్రీ మాతా చిత్స్వరూపానంద**

"నీవు ఆనందస్వరూపుడివే. నీ లోపల ఉన్న ఆనందం కోసం బయటి ప్రపంచంలోని వ్యక్తుల నుంచో, వస్తువుల నుంచో, మరిదేని నుంచో వెదికి పొందాలని చూస్తున్నావు. నీకంటె వేరుగా ఉన్న దేనినుంచీ కూడా మార్పు లేని శాశ్వతానందం నీకు దొరకదు. దేశ కాల వస్తు పరిచ్ఛేదమైన ఆనందం నీ లోపలే ఉంది. అసలు అదే నీవు" అని శాస్త్రాలు ఘోషిస్తున్నాయి. ఎంత వరకు నిజం - అన్నది విశ్లేషించి చూద్దాం.

మొదట యుక్త వయస్కులు, ఆపై వయస్సు వారిని పరిశీలిద్దాం. (వీరిలో మనమూ ఉన్నాము). యుక్త వయస్సులో సాధారణంగా తమ వయస్సు వారినే ప్రేమిస్తారు. అరుదుగా కొంతమంది గురువులను, తల్లిదండ్రులను ప్రేమిస్తారు. మొత్తం మీద ఆనందాన్ని బయటనే వెదుక్కుంటారు తప్ప తమలో వెదుక్కోరు. చిన్నతనంలో అమ్మ ఒడి, బడిలో టీచర్లు, మిత్రులు... ఎవరెవరినో ఆనందం కోసం ఆశ్రయిస్తారు. కొందరు రకరకాల తినుబండారాల ద్వారా, ఇంకొందరు (అరుదుగా) కళల ద్వారా ఆనందం పొందాలనుకొంటారు. మరికొందరు ఆటపాటల్లో పొందాలని ఆశిస్తారు. కానీ, ఇవన్నీ శాశ్వతానందాలు కావు గనుక వృథా ప్రయాసే మిగులుతుంది. మరి దీనికెలా పరిష్కారం?

ఒక బోధకుని దగ్గరకు శిష్యుడు వెళ్లాడు.

**శిష్యుడు :** "స్వామీ, చిరంతనమైన ఆనందం పొందేదెలాగో సెలవివ్వండి".

**బోధకుడు :** ఏం నాయనా, డబ్బుతో ఆనందం లభించటం లేదా?

**శిష్యుడు :** అయ్యో, ఎక్కడండీ - ఎంతున్నా చాలదనిపిస్తుంది. ఇంకా యింకా ఆశ పీడిస్తూనే ఉంటుంది. దీనితో తిండి, బట్టా, ఆరోగ్యం కనుక్కోన్నట్లే ఆనందం కనుక్కోవాలంటే కుదరదు స్వామీ! పైగా దుఃఖం పెరుగుతుంది. సమస్యలింకా ఎక్కువవు





తాయి డబ్బుతో.

**బోధకుడు :** చుట్టూ ఉన్న వాళ్లు నిన్ను గౌరవిస్తారు గదయ్యా - డబ్బుంటే!

**శిష్యుడు :** ఎక్కడ స్వామీ, పీక్కుతింటారు. ఇస్తే ఒక గోల - ఇవ్వకుంటే ఒక గోల. అసూయలు, కలహాలు, ద్వేషాలు డబ్బు చుట్టూ అల్లుకొనే ఉంటాయి. కన్నబిడ్డలే శత్రువులయ్యే సందర్భాలు లేకపోలేదు. కాకపోతే డబ్బుతో పొందే కొన్ని సంతోషాలుంటాయి గానీ - అవేవీ నిలిచేవి కావు గదా స్వామీ!

**బోధకుడు :** అవును-అంటే ధనం వలన ఆనందభ్రాంతేగానీ ఆనందం దొరకదు. డబ్బును సవ్యంగా ఉపయోగించి ధన్యులవ్వాలే తప్ప దాన్ని జీవనలక్ష్యంగా భావించకూడదు. సరే-మరి నీ బంధు మిత్రులు, భార్యాబిడ్డలు వీరంతా నీవారే కదా! నీకు ఆనందాన్ని స్తారు గదా!

**శిష్యుడు :** వీళ్లందరితో ఎప్పుడో ఒకప్పుడు గొడవలు రాకుండా ఎలా ఉంటాయి స్వామీ! ఎవరికి వాళ్లే అహంతో పోరాడుకొని, విడిపోయి, విచ్ఛిన్నమైన కుటుంబాలెన్ని లేవు? సంతానమైనా వాళ్ల ఆనందమే వెదుక్కొంటారు.

**బోధకుడు :** అయితే ఈ అంశాన్ని - బాంధవ్యాల వల్ల వచ్చే ఆనందం శాశ్వతం కాదన్నదాన్నీ ఒప్పుకొందాం. పోనీ, పేరు ప్రతిష్ఠల వలన ఏమైనా లాభం ఉంటుందంటావా?

**శిష్యుడు :** పేరు పొందిన వాళ్లు, సినిమా నటులు, రాజకీయ నాయకులు ... క్షణికమైన విజయానందాలే తప్ప శాశ్వతానందం ఎలా పొంద గలరు స్వామీ! ఎత్తులకు పై ఎత్తులు, హత్యలూ, దుండగాలూ, వంచనా - అయ్య బాబోయ్ - ఎన్ని బాధలో, ఎన్ని పాపాలో! ఇంక ఆనందమెక్కడ?

**బోధకుడు :** అంచేత - ఇంకా యింకా పైకి ఎగరాలన్న దుగ్ధే తప్ప తపనే తప్ప - శాంతిలేనిజీవులకు ఆనందం ఎక్కడిది?

**శిష్యుడు :** అయితే మానవాళికి శాశ్వతానందం దొరికే అవకాశమే లేదా స్వామీ!

**బోధకుడు :** దాని కోసమే భగవంతుడు మనకు నాలుగవస్థలు ఇచ్చాడయ్యా! అవి జాగ్రత్, స్వప్న, సుషుప్తి, తురీయం అనే చతుర్విధావస్థలు. జాగ్రదవస్థలో అంటే మెలకువలో ఏదీ మనకు చిరంతనానందాన్నివ్వదని తెలిసిపోయింది. ఇక స్వప్నం అన్నది మన చేతిలో లేదు. మన చేతిలో ఉన్నాయనుకున్నవీ, లేదనుకున్న స్వప్నావస్థా రెండూ మనం కోరిన దాన్నివ్వలేవు అనేది స్థిరం. మూడవదైన సుషుప్తి. ఇది కలలు రాని కలతలు లేని దశ. నిద్రపోయి లేచాక "హాయిగా నిద్రపోయాను. సుఖంగా ఉంది" అంటాం. ఇది సత్యమా? సత్యమంటే నిజమనికాదిక్కడ. గాఢనిద్రలో కలలూ, కలతలూ లేవు గనుక ఆనందంగా ఉన్నదనుకున్నాం. కానీ, ఆ ఆనందం ఎప్పుడూ పొందగలమా? ఇది త్రికాల- భూత, వర్తమాన, భవిష్యత్ కాలాలు మూడింటిచేత బాధింపబడనిదా? కాలాతీతమా? అనగా నిత్యమా? కాదే! కానీ, ఆనందం కోసం మనం జగత్తులో పోగు చేసుకున్న బంధ, వస్తుతతినీ, ఆలోచనలనూ అన్నిటినీ వదిలేసి నిద్రలో మునిగిపోతాం గనుక గాఢనిద్ర మనకు కొంత సుఖాన్నిస్తుంది. "హాయిగా కాస్సేపైనా పడుకోనివ్వరు" అని నిద్రాభంగమైనప్పుడు విసుక్కొనే కారణం యిదే. అంటే యీ ఆనందం ....

**శిష్యుడు :** అర్థమైంది స్వామీ! ఇది బయటి వస్తువులలో నుంచీగానీ, ఆలోచనల నుంచీగానీ కలగటం లేదు. మన లోపలి నుంచే వస్తోంది.

**బోధకుడు :** అదీ! సరిగ్గానే గ్రహించావు. ప్రపంచంతో ఏ సంబంధం లేనప్పుడు నీవు ఆనందం అనుభవిస్తున్నావూ అంటే - అది నీ లోపలే దాగి ఉంది. ఆ గాఢ నిద్రావస్థలో దాన్నే అందుకో గలిగావన్నమాట.





**శిష్యుడు :** అలాంటి ఆనందం మనం మెలకువగా ఉన్నప్పుడు కూడా పొందాలంటే దారిలేదా స్వామీ!

**బోధకుడు :** భగవద్గీత రెండవ అధ్యాయంలో శ్రీకృష్ణుడు

"ప్రజహాతి యదా కామాన్, సర్వాన్ పార్థ మనోగతాన్ ।
ఆత్మన్యేవాత్మనా తుష్టః, స్థితప్రజ్ఞః తదోచ్యతే ॥

- మనోగతమైన కోరికలను, ఆలోచనలను సమస్తాన్నీ వదిలేసి, తాను ఆత్మస్వరూపంగానే నిలచినవాడే శాశ్వత తుష్టి పొందుతాడు. అది నిరాలంబన (ఏ ఆధారమూ లేని) పరిపూర్ణ శాశ్వతానందం అదే. తానే ఆత్మ అని తెలిసినవాడు దేనికీ వెంపర్లాడడు. 'దేహేంద్రియ ప్రాణ మనో బుద్ధులకు అతీతమైనదే నేను" అని తెలిసాక యిక స్థిరంగా ఉండి నిత్యానందాన్ని పొందడం అలవోక.

అందుచేత - నాయనా, ఇహపర సుఖాలన్నీ నిస్సారాలనీ, అసలైన ఆనందం తనలోనే ఉందనీ' తెలిసికొనటమే శాశ్వతానందానికి ప్రాతిపదిక. ఎవ్వరి ప్రమేయం వలనా ఆనందప్రాప్తి కలగదు. కేవలం ఆత్మజ్ఞానం వల్లనే కలుగుతుందని తెలిసినవాడే ముని. గడ్డాలు పెంచేసి, కాషాయం కట్టేస్తే ముని కాడు. తన స్వస్వరూపాన్ని గ్రహించగలిగినవాడు, మనోబుద్ధ్యహంకారాలకు అతీతమైన ఆత్మలో స్థిరపడినవాడే స్థితప్రజ్ఞుడు - అతడే ముని.

**శిష్యుడు :** ఆ స్థితప్రజ్ఞత్వం ఎలా సాధించగలం స్వామీ!

**బోధకుడు :** సాధన ద్వారా నాయనా! ఈ సత్యం మళ్లీమళ్లీ మననం చేసుకొంటూ స్థిరపరచుకోవాలి.

అసలు తమాషా ఎక్కడుందో తెలుసా నాయనా! ఇహలోకంలో ఆనందం కోసమని ఏమేమి, ఎవరెవరిని పోగు చేసుకున్నావో, ఏమేమి ఆలోచించావో-వాటన్నిటినీ వదిలిపెట్టి నీ సహజస్థితిలోకి వస్తే అదే దివ్యానందం-బ్రహ్మానందం అని మననశీలురైన మునులంతా సెలవిచ్చారు. ఎప్పుడు పూర్తిగా అన్నీ వదిలేస్తావో నీవే ఆనందస్వరూపంగా మిగిలిపోతావు. అదే రహస్యం. అదే సాధన. అదే సత్యం.

# లేఖావాణి

- భేరి సోమన్న

## కలయో, వైష్ణవ మాయయో ....

భగవంతుడు ఒక్క వారములో సృష్టి కార్యము ముగించి నాడంటుంది బైబిల్.

శ్రీరాముడు వారధి కట్టడానికీ, మయుడు మయసభ నిర్మించడానికి ఎన్ని దినాలు పట్టిందో రికార్డు లేదు. కాని చాలా సమయమే పట్టి ఉంటుంది. ఇక గంగమ్మను తీసుకురావటానికి సగరుడు మొదలుకొని అతని మునిమనుమడిదాకా కొన్ని తరాలు (ఆనాటి తరాలు నలభై, యాభై ఏండ్లు కాదు, కొన్ని వేల సంవత్సరాలే) కష్టపడాల్సి వచ్చింది. మన ఇంజనీర్లు నదులకు ఆనకట్టలు కొన్ని పంచవర్ష ప్రణాళికలలోగాని పూర్తి చేయలేక పోతున్నారు. మరి పన్నెండు నెలల కంటె తక్కువ కాలములో ధ్యాన మందిరము నిర్మింపజేసి, పాలరాతి విగ్రహ ఆవిష్కరణ ముగించగలిగిన ఉదంతాన్ని “కలయో, వైష్ణవ మాయయో, యితర సంకల్పార్థమో, సత్యమో, తలపన్నేరకయున్నవారము ... మహాశ్చర్యంబు చింతింపగన్.....” అనుకోకుండా ఉండగలమా!

కాలచక్రము తిరుగుతూనే ఉంటుంది. అందులో క్షణాలు, నిమిషాలు, గంటలు, జాములు, రాత్రింబవళ్ళు, ఋతువులు, సంవత్సరాలు దొర్లిపోతూనే ఉంటాయి. వానిలో ఇరుక్కొని ప్రకృతి, ప్రాణులు పరిభ్రమిస్తూ ఉంటాయి. ఎవరు ఏమిచేసినా, ఏమి అన్నా కాలచక్రం ఆగదు.

శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ వారు భౌతికంగా మనకు దూరమై ఒక సంవత్సరము అంటే పన్నెలకాలం గడిచింది. సాయిధామం ఆశ్రమం నడుస్తూనే ఉంది. సాయినాథ క్షేత్రము, కోదండ రామాలయం, సాయి దేవాలయాలలో కూడా కార్యక్రమాలు నడుస్తున్నాయి. సాయి విద్యాధామం, సాయివాణి మాసపత్రిక, నిత్యాన్నదాన కార్యక్రమాలు,





అనాథాశ్రమాలు, వానప్రస్థాశ్రమాలు, సత్సంగాలు ఎప్పటిలాగానే జరుగు తున్నాయి. వీటన్నిటినీ గమనిస్తే ఏదో ఒక అరూప, అపురూప, అదృశ్యశక్తి వీటిని నడిపిస్తున్నట్లు తోస్తుంది. దాన్నే మన గురుదేవుల ఆశీర్వచన బలం అనవచ్చు. అది మాతాజీ, ఆనందంగారు, రాము మరియు మిగతా ఆశ్రమ సిబ్బంది యొక్క అకుంఠిత దీక్ష, పరిశ్రమ,... మొదలైన వాటి ద్వారా వ్యక్త మౌతూ కార్యక్రమాల్ని సాధ్యపరుస్తూ ఉన్నదనవచ్చు.

పన్నెండు నెలలు...పన్నెండు... ప్రత్యేకత ఏమిటి? పన్నెండు నెలలకొకసారి చెట్లఆకులు రాలతాయి. చెట్లు చిగురిస్తాయి. పూలు, పండ్లు అందిస్తాయి. తర్వాత మామూలుగా ఉంటాయి. పన్నెండు నెలల్లో వర్షాకాలం వస్తుంది. శరత్కాలము వస్తుంది. చలికాలం వస్తుంది. పన్నెండు నెలలౌతూనే ఎవరో ఆజ్ఞాపించినట్లు చెట్ల ఆకులు రాలుతాయి మళ్లీ. చివురుటాకులు మేమున్నామంటూ తొంగిచూస్తాయి. ఏ కంప్యూటర్‌లో యీ కార్యక్రమ అంశాల జాబితా పొందుపరచబడిఉందో తెలియదు. అనాదిగా గతి తప్పకుండా యివి జరుగుతూనే ఉంటాయి.

ఈనాడు ప్రపంచములో, ముఖ్యంగా భారతదేశములోనూ మామూలై పోయిన బాంబుదాడులు, దోపిడీలు, హత్యలు మొదలైన మరెన్నో ఘాతుకాల గురించి వింటూ .. వీటిని అరికట్టగలిగే నాథుడే లేడా? కనీసం సినిమాహీరోలైనా ముందుకువస్తే ఎంత బాగుండును... అంటూ ఆలోచించి, ఆలోచించి బుర్రపాడుకాగా “ఎండిపోయెను చైతన్య మిండియాలో” అనిపించింది. ఆ శీర్షికతో కొన్ని పద్యాలు వ్రాసినాను. కాని సంఘంలో జరుగుతున్న సామాజిక సేవలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రత్యేకించి సాయిధామంలో జరుగుతున్న కార్యక్రమాలను చూచి వాటిని నడిపిస్తున్న అరూప, అపురూప, అదృశ్యశక్తిని కూడ గురించి ఆలోచించి ఎండిపోలేదు చైతన్యమిండియాలో” అనే శీర్షికతో మరికొన్ని పద్యాలు వ్రాసినాను. ఇంకొంచెము ముందుకుసాగి “ఎండిపోవునే చైతన్య మిండియాలో, ఎండిపోవదు చైతన్యమిండియాలో, ఎండిపోనీ చైతన్య

మిండియాలో...." అనే శీర్షికలతో కూడ వ్రాయాలని అనుకుంటున్నాను.

జరుగుతున్న సంఘటనలలో మన ప్రమేయం, మన పాత్ర, మన జోక్యం ఎంతవరకు పనిచేస్తాయి? మనం కేవలం నిమిత్తమాత్రులమేనేమో! పోతనామాత్యుడు భాగవతాఖ్య కల్పతరువును గంటమును పంచదారలో నద్ది రచించినాడేమో అన్నంత మృదుమధురంగా రచించినాడు. అందులో తన పాత్ర ఏమిటో యీ క్రింది విధంగా చెప్పకున్నాడు.

పలికెడిది భాగవతమట పలికించెడి వాడు రామభద్రుండటన్
పలికిన భవహరమగునట పలికెద వేరొండు గాథ పలుకగనేలా ॥

పోతన ఎంత నిగర్వియో దీనివల్ల తెలుస్తుంది. దీనిని కొంచెము రూపాంతరమొందించి మనకు అన్వయించేటట్లు చేసుకోవచ్చు.

చేయవలె సేవ దీక్షతో - చేయించెడి వాడు సాయి, చేయుటే పనిగా
చేయగ సామికి ప్రియమగు చేయక అది వేరు పనులు చేయగనేలా॥

అని తెలుసుకొని సేవా కార్యక్రమాలు చేపట్టవలెనని సూచన.

దేవతలు మారువేషాల్లో వచ్చి పరీక్షించి, మెచ్చి నిజరూపాలతో ప్రత్యక్షమై ఏమి కావాలో కోరుకో అన్నారుట రంతిదేవునితో. ఆయన సమాధానం మనకందరికీ కనువిప్పు కలిగిస్తుందనటంలో అతిశయోక్తి ఎంతమాత్రమూ లేదు.

నత్వహం కామయే రాజ్యం నస్వర్గం నా పునర్భవం
కామయే దుఃఖతప్తానామ్ ప్రాణినా మార్తినాశనం ॥

"రాజ్యం వద్దు, స్వర్గం వద్దు, మోక్షం కూడ వద్దు. దుఃఖాగ్నిలో మాడుతూ ఉన్న వారి బాధలను పోగొట్టగల సంకల్పాన్నీ, శక్తినీ ప్రసాదించండి" అన్నాడు. దేవతలు ఆయన అడిగినదీ, అడుగనివీ యిచ్చి అంతర్ధానమైనారట!

సాయిధామానికి కూడా అలాటి అనుగ్రహం కలుగుగాక!

మీ,
సోమన్న






# మన పెద్దలిచ్చిన చద్దిమూటలు

1. పదవే రాముని జేర పాపిష్టి ఘటమా
ఎన్నాళ్లు బ్రతికినా - యిది నీకు స్థిరమా ॥ప॥
అన్నదమ్ములంచు - ఆలుబిడ్డలంచు
కన్నవారలనుచు - కలవరపడనేలా?
అన్నీ పోదన్ను - దయాళుడై నీ కొరకు
నిన్ను రక్షింప - ప్రసన్నుడైయున్నాడు ॥పదవే॥
వేదాలు శాస్త్రాలు - ఎన్ని చదివిన గానీ
ఎన్నెన్ని పీఠాలు - ఎక్కి కూర్చున్న గానీ
బంగారు టూయెలలో - ఊగుచుండినగానీ
పొయ్యేదే నిజమూ - యమపురము జేరకముందే ॥పదవే॥
పదవే రాముని జేర - పాపిష్టి ఘటమా
ఎన్నాళ్లు బ్రతికినా - యిది నీకు స్థిరమా? ॥పదవే॥

2. వస్త్రా వట్టిదె పోతా వట్టిదె ఆశలెందుకంటా
చేసిన ధర్మము చెడని పదార్థము వచ్చును నీ వెంటా
పంచభూతముల తోలు బొమ్మలతో
ప్రపంచమాయె నంటా
అంతము వరకు కించిదాశతో
ముంచెను జగమంతా ॥వ॥
చేతిలో బెల్లం ఉన్నంతవరకే
కాకి బలగమంటా
అగాధంబై పొయ్యేనాడూ
ఎవరూరారు వెంటా ॥వ॥
వస్త్రావట్టిదె పోతావట్టిదె-ఆశలెందుకంటా
చేసిన ధర్మము చెడని పదార్థము వచ్చును నీవెంటా.

# శ్రీ గజానన విజయం



- ప.పూ.శ్రీశ్రీశ్రీ సత్యపదానంద ప్రభుజీవారు

**(గత సంచిక తరువాయి)**

అకోలాలో రాజారాంకవార్ అనే ఒక షరాఫ్ ఉండేవాడు. అతను మధ్య తరగతివాడు. గజాననులు అతనిని అభిమానించేవారు. రాజారాం పిల్లలు కూడా గజాననులను గౌరవించేవారు. వారి పేర్లు గోపాల్, త్ర్యంబక్. త్ర్యంబక్‌ను 'భావు' అని పిలిచేవారు. వైద్యం అభ్యసించడానికి అతడు హైదరాబాదు వెళ్లాడు. భావుకు భగవద్ధ్యానం ఎక్కువ. బాధ కలిగితే అతనెప్పుడూ గజాననులను ధ్యానిస్తూ ఉండేవాడు.

సెలవులకు ఇంటికొస్తే షేగాఁవ్ వెళ్లాలనుకొనేవాడు. ఒకసారి మహరాజ్‌కు భోజనం పెట్టాలనిపించింది అతనికి. తనకు తల్లి లేదు. తాను నానీ అని పిలిచే ఆమె నోరు మహాచెడ్డది. భఖారీ రొట్టెగానీ, జవారీ రొట్టెగానీ చేయించి, ఉల్లిపాయ పచ్చిమిర్చి వేసిన ఆకుకూరతో పెట్టాలని ఉంది. కానీ, నానీ చెయ్యదేమో! తల్లినైతే ఎలాగో బ్రతిమాలి చేయించు కోవచ్చుగానీ .... అతనిలా అనుకొంటుండగానే నానీ అక్కడికి వచ్చింది. అతని ముఖం చూచి 'ఏమిటలా ఉన్నావ'ని అడిగి విషయం తెలుసుకున్నది. అంతమాత్రానికే బాధ దేనికని ఓదార్చింది. మహరాజుకు పెట్టే వంట తానే చేస్తానన్నది. భాకరీలు చేసింది. ఉల్లి, మిర్చి కలిపిన సెనగ పిండిని చక్కగా వెన్నపూసినట్లు ఆ రొట్టెలకు పూసింది. భావూని పిలిచి 'ఇవిగో, తీసుకో. త్వరగా వెళ్లకపోతే భోజనం వేళకు షేగాఁవ్ చేరుకోలేవు" అని చెప్పింది. అతడు తండ్రి దగ్గర అనుమతి తీసుకొని త్వరత్వరగా స్టేషన్‌కు వెళ్లాడుగానీ రైలు కాస్తా వెళ్లిపోయింది అప్పటికే.

భావూ నిరాశపడ్డాడు. "మహరాజ్! ఎందుకు నా మీద దయ తప్పింది?





నా నివేదన ఎందుకు స్వీకరించదలుచుకోలేదు? నేనేమైనా అపరాధం చేసానా? యోగ్యుడిని కానా? నా భక్తి సరైనది కాదా? మళ్లీ మూడింటికి గానీ రైలు లేదు. అప్పుడు బయలుదేరి వచ్చినా యీ నివేదన నీకు సమర్పించటం కుదరదు. ఒక్క క్షణకాలంలో కేదారనాథ్ చేరగల సమర్థుడివి గదా! ఇక్కడికే వచ్చి యీ రొట్టెలు తినకూడదా? నేను నిన్ను ఆజ్ఞాపిస్తున్నాననుకోవద్దు స్వామీ, అభ్యర్థిస్తున్నాను. ప్రేమతో ప్రార్థిస్తున్నాను. నీవు రాకపోతే యివ్వేళ నేను కూడా ఏమీ తినను" అంటూ వేడుకొన్నాడు.

తరువాత మూడు గంటల రైలెక్కి షేగాఁవ్ చేరుకున్నాడు భావూ. గజాననులు అప్పటివరకు నిరాహారంగా కూర్చొని ఉన్నారు. తమ చుట్టూ ఉన్న జిలేబీలు, ఖీర్, శ్రీఖండ్, పూరీ యింకా యింకా మిఠాయిలను ఆయన ముట్టనే లేదు. బాలాభావు ఒక్కొక్కటిగా తెచ్చి మహరాజ్‌ను ఎంత బ్రతిమాలినా వారు ఏదీ ముట్టలేదు. "మీరు తినకపోతే భక్తులకు ప్రసాదం దొరికేదెలా? వారు మిమ్మల్ని అడగలేక నిలబడి ఉన్నారు" అన్నాడు బాలాభావు. "నన్నేమీ ఒత్తిడి చెయ్యకురా! నేనీవేళ ఆలస్యంగా సాయంత్రానికి తింటాను. వాళ్లందరినీ అప్పటిదాకా ఉంటే ఉండమను - లేకపోతే అవన్నీ యిళ్లకు తీసుకుపొమ్మను" అన్నారు గజాననులు.

భావూ రైలు దిగి వచ్చాడు. మహరాజ్ ముఖం చిరునవ్వుతో వెలిగింది. మాతృభావనతో ఆప్యాయంగా చూచారతనివైపు. భావూ ఆయన ముందు సాష్టాంగపడిలేచి వినయంగా ఓ ప్రక్కన నిలబడ్డాడు. గజాననులు అతన్ని చూచి "నన్ను భోజనానికి పిలిచి యింత ఆలస్యంగా వచ్చావు. నేనేమో ఏమీ తినకుండా కూర్చున్నాను. నీవు తెచ్చినవి ఇవ్వు మరి!" అన్నారు. భావు ఆనందానికి మేరలేదు. తనకు రైలు తప్పిపోయిందని చెప్పాడు. బాలాభావు కల్పించుకొని 'ఇప్పటికే ఆలస్యమైంది. ఏం తెచ్చావో త్వరగా తియ్యి. స్వామీ ఏమీ తినలేదింతవరకు" అన్నాడు. భావు కవార్ భాకారీ రొట్టెలు, సెనగ పిండి కూర స్వామికి సమర్పించుకొన్నాడు. వారు రెండు తిని, మిగిలినది

ప్రసాదంగా భక్తులకిచ్చారు. ఈ సంఘటన వలన గజాననులకు భక్తులకు ఎంత ప్రేమో అందరికీ తెలిసింది. ధనికులు తెచ్చిన గొప్ప గొప్ప మిఠాయిల కంటె ప్రేమతో తెచ్చిన యీ అల్పనివేదననే యిష్టంగా స్వీకరించారు గదా! గజాననులు భావుని "ఇక నీవు అకోలా వెళ్లిపో. నీవు పరీక్ష పాసవుతావు. వచ్చే సంవత్సరం డాక్టరువవుతావు" అని ఆశీర్వదించారు. అతడు "మిమ్మల్ని నేనెప్పుడూ మరచిపోకుండా ఉండేలాగా ఆశీర్వదించండి" అని నమస్కరించి వెళ్లిపోయాడు.

షేగాఁవ్‌లో తుకారాం షెగోకర్ అనే ఒక రైతుండేవాడు. అతడు పేదవాడు. శ్రమించి పనిచేసే తత్వం ఉన్నవాడు. ప్రతిరోజూ సాయంత్రం పూట మఠానికి వచ్చి గజాననుల కోసం చిలుం తయారుచేసి యిచ్చి, పొలానికి వెడుతుండేవాడు. ఒక రోజతను పొలం ప్రక్కనే చిన్న చితుకుల మంట వేసుకొని చలి కాగుతున్నాడు. అతని వెనుక కొన్ని ముళ్ల పొదలున్నాయి. కుందేళ్ల వేటకోసం వచ్చిన వాడొకడు ఆ పొదల్లోని కుందేటి కోసం తుపాకీ పేల్చాడు. ఒక గుండు కుందేటికి తగిలి చనిపోయింది. కానీ మరో గుండు వచ్చి తుకారాం చెవి వెనుకగా తలలోకి దూసుకు పోయింది. వైద్యులు ప్రయత్నించి కూడా దాన్ని బయటికి తీయలేక పోయారు. విపరీతమైన నొప్పి - రోజురోజుకూ పెరుగుతోంది. అటువంటి బాధాకర పరిస్థితులలో కూడా అతడు మఠానికి రావటం మానలేదు. ఒకరోజు ఒక భక్తుడు అతనితో "ఇక శస్త్రచికిత్సలూ, వైద్యాలూ చాలు. యోగులకు సపర్య చేయటం అన్నది సర్వశ్రేష్ఠమైన మందు. అది సర్వ రోగ నివారిణి. నీవు రోజూ యీ మఠం చుట్టూ ఊడ్చి శుభ్రం చేస్తూ ఉండు. మహరాజు దయ తలిస్తే నీ నొప్పి చిటికెలో పోతుంది కానీ, ఆ పని అహంకారంతో చెయ్యకు. వినయంతో, స్వచ్ఛ హృదయంతో చెయ్యి" అన్నాడు.

తుకారాం అలాగే ఊడవసాగాడు. అతి పరిశుభ్రంగా అతడాపని





పన్నెండుగేళ్లపాటు క్రమం తప్పకుండా చేసాడు. ఒకరోజు తుపాకిగుండు అతని చెవిలోనుండీ దానంతట అదే బయటికి పడిపోయింది. నొప్పి పోయింది. అయినాగానీ, తుకారాం జీవితాంతం తన సేవ మానలేదు. మనిషికి ఉండే సందేహాలను అనుభవమే పోగొట్టగలదు. అదే భక్తిని గాఢం చేస్తుంది. గాఢ భక్తే ముక్తి సాధనం. యోగుల సేవను మించిన జ్ఞానమార్గం మరొకటి లేదు. గజానన్ మహరాజుకూ జై!

**(16వ అధ్యాయం సమాప్తం)**

**(సశేషం)**

# సాకోరీ మహర్షి

## 3వ అధ్యాయం

**మూలం : దాసుగణు**

**అనుకరణ : శుకవాణి**

**(గత సంచిక తరువాయి)**

ఇది కుటుంబ గౌరవాన్ని చెడగొట్టే పనే. కానీ తప్పని దానికి బాధపడి లాభం ఏముంది. ఆ చేదుని వారు మౌనంగా మింగేసారు. నాసిక్ చేరాక కాశీనాథ్‌కి ఇంటి గురించీ, తన తల్లిదండ్రులు తన కోసం పడే ఆరాటం గురించి ఆలోచనలు కలగసాగాయి. అతను అందుచేత తాను నాసిక్‌లో తమ కుటుంబ మిత్రుల దగ్గర ఉంటున్నానని ఉత్తరం వ్రాసాడు. అటుపైన రెండు నెలలకు తల్లి జబ్బు పడిందని తెలిసి తిరిగి ఇంటికి వచ్చాడు.

అటుపై కొద్దికాలానికి అతని భార్య మరణించింది. కానీ ఏకాంతవాసం ఎక్కువకాలం గడవలేదు. భార్య పోయిన కొద్ది వారాలకే కాశీనాథ్‌కు మరో వివాహం జరిగింది. పెద్దలకు, యీ వధూవరులకు కూడా జరిగిందంతా స్పష్టంగానే తెలుసు. కళ్లారా సత్యాన్ని చూస్తూనే యీ వివాహం జరిపితే యీ పాపం లేదా గొప్పతనం ఎవరికి చెందాలో అర్థం కాదు. 15ఏళ్ల కాశీనాథ్ 9 ఏళ్ల అతని భార్య చదరంగంలో పావుల్లాగా

కనపడ్డారు. ఓ యేడాది గడిచింది. తన చేదు అనుభవాలతో కాశీనాథ్ మళ్ళీ భార్యను విడిచి అక్కడక్కడా తిరగసాగాడు. ఆ ఇల్లాలు దాదాపు 7 సం॥ అతని ఇంట్లోనే పడి వుంది. కొన్నాళ్లు ఏవో పనులు చేసుకుంటూ, కొన్నాళ్లు భిక్షమెత్తుకుంటూ, తరువాత అతను అప్పడప్పడు అరుదుగా ఇంటికి వస్తూ తిరుగుతూ ఉన్నాడు. భరించరాని పేదరికం, యాచన మొదలైన పరిస్థితులలో కాశీనాథ్ జీవితం బాధాకరంగా నడిచింది. నిర్లక్ష్యం, తిరస్కారం మొదలైన వాటితో అతని జీవనచిత్రం నిండిపోయింది. తరచుగా కాశీనాథ్ తన కర్మను నిందించుకుంటూ ఉండేవాడు. తాను గత జన్మలలో మహాపాపాలు ఏం చేసాడో, భగవంతుడు తన పట్ల ఎందుకు అంత క్రూరంగా ప్రవర్తిస్తున్నాడో అని బాధపడ్డాడు. అప్పడతనికి జవాబు దొరకలేదు. చాలాకాలానికి యీ కష్టాలు ఎందుకు వచ్చాయో? ఈ కఠిన పరీక్ష తనకు అర్థం అయ్యింది.

నిపుణుడైన శిల్పి తాను తయారుచేసే పాలరాతి బొమ్మమీద అనవసరంగా ఒక్క దెబ్బ కూడా వేయడు. సమర్థుడైన వైద్యుడు రోగికి అవసరం మించి ఒక్క మాత్ర కూడా ఎక్కువ ఇవ్వడు. ఒలింపిక్ ఆటలలో ఆడవలసిన అభ్యర్థికి అవసరమైన దానికంటే పనికిరాని శిక్షణ జిమ్నాస్టిక్ శిక్షకుడు యివ్వనే యివ్వడు. కాశీనాథ్ తనకు వచ్చిన విపన్మేఘాలన్నీ తన మీది కరుణతో పరమాత్ముడిచ్చిన ఆశీర్వచనాలే అని ఆయన ఆశించాడు. అయితే అప్పటిరోజుల్లో ఆ కారుమబ్బులు అతని జీవనాకాశం నిండా నిండి యీ చిన్న ఆశాకిరణాన్నిగానీ, దాని ఆంతర్యం గురించిన ఆలోచనగానీ యివ్వలేదు. ఇన్ని రోజులపాటు రోజుకు ఒక్కపూటైనా తిండి లేక వేపాకుతో నూరిన ముద్దతోను, నదిలోని నీళ్లతోను ఆకలి తీర్చుకున్నానని అతనికి తెలుసు. ఎన్నిరాత్రులు ఓ ధర్మశాల, ఒక ఆసుపత్రి వరండా కూడా కనిపించక ఏ చెట్టు క్రిందో, ఏ ఆరుబయటో తన చెయ్యే





తలగడగా - ఒంటిమీద బట్టలే దుప్పట్లుగా నిద్రపోవలసి వచ్చిందో! ఇక అతని చుట్టూ ఉన్న సహచరులు, ఏ విలువలు, సిద్ధాంతాలు లేక ఎంగిలి మెతుకుల కోసం కొట్లాడుకునే భిక్షగాళ్లే!

దుఃఖపు కొలిమిలో బాగా కాలినపుడే అచ్చమైన, దృఢమైన మనిషి తయారవుతాడు. సల్ఫిలిఫ్ సిడ్నీ యుద్ధరంగంలో శరీరమంతా గాయాలతో పడి ఉండి, తనకు అపురూపంగా దొరికిన గుక్కెడు నీళ్లను మృత్యుముఖంలో ఉన్న సామాన్య సైనికుడికి యిస్తూ "నాకన్నా నీకే యీ నీళ్ళు ఎక్కువ అవసరం" అన్నాడు. ఆ రోజుల్లో కాశీనాథ్ సాటిలేని భిక్షగాళ్ళ పట్ల చూపిన ఆదరణ ఆయన పదేపదే గుర్తు చేసుకుంటారు. మూడు రోజులపాటు ఆకలితో మాడే భిక్షగాళ్లతోపాటు ఒక్క మెతుకైనా లేకుండా గడపవలసి వచ్చింది. నాలుగవ రోజు ఒక దయ గల తల్లి అతనికి పూర్తి భోజనం పెట్టింది. ఆ మర్నాడు యింకా ఎక్కువ పెట్టింది. మూడవనాడు నుంచి అతను ఆమె యిచ్చిన ఆహారం తీసుకుని దేవాలయం దగ్గరున్న యాచకులందరికీ పంచసాగారు. అతన్ని చూసి అబ్బురపడిన ఇల్లాలు వాళ్లందరికీ సరిపడే భోజనం పంపసాగింది. ఒక్కనెలలో 1000 మంది కడుపు నింపసాగింది. కష్టాల్లో ఉన్నవారికి సహాయం చేసేవారిని కాశీనాథ్ ఎప్పడూ వదులుకునేవాడు కాదు. అలాగే పవిత్రులు, సాధు జీవనులు దొరికితే వారి చెంత కూర్చుని చేదు పూల నుంచి కూడా చుక్క చుక్కగా తేనె పోగుచేసుకుని తేనెటీగలాగా జ్ఞానాన్ని నేర్చుకోకుండా వదిలేవాడు కూడా కాదు. ఆ తర్వాత తను యాచకమిత్రులను, పూనా నగరాన్ని విడిచి ఒక సాధు బ్రహ్మచారి వెంట వెళ్లిపోయాడు. ఆయన బ్రహ్మచర్యం యొక్క గొప్పతనం గూర్చి, శివారాధన ఘనత గూర్చి ఎన్నో విషయాలు బోధించాడు. కాశీనాథ్ తదుపరి జీవితంపై అతని ప్రభావం చాలా ఉంది.

**(సశేషం)**



ఓం శ్రీ సాయిరాం

# షిరిడీ డైరీ

– మాన్యశ్రీ జి.ఎస్. కపర్దే

అనువాదం : మాతా శుకవాణి

(గత సంచిక తరువాయి)

## షిరిడీ డైరీ–శ్రీమతి లక్ష్మీబాయి గణేశ్‌కపర్దే

– వి.బి. ఖేర్

శ్రీమతి లక్ష్మీబాయి కపర్దే సాయిబాబా మెచ్చిన భక్తురాలు, సాయి ఆమెకు ఉపదేశకులు. ఆమెకు, బాబాకు ఉన్న ఋణానుబంధం, ఆయన వలన పొందిన ఉపదేశాల గూర్చి శ్రీ సాయి సచ్చరిత్ర 27వ అధ్యాయంలో 139-169 (ఓవీ) ఛందో శ్లోకాల మధ్య చెప్పబడింది. అలాగే ఏడవ అధ్యాయంలోని 100-110 శ్లోకాలలో ఆమె కుమారుడి కర్మఫలాన్ని (ప్లేగు వ్యాధిని) బాబా తన మీదికి ఎలా తీసుకొని ఆమె ఆతురతనెలా పోగొట్టారో చెప్పబడింది. ఈ కథలు ముందు చెప్పుకొని, తరువాత షిరిడీ డైరీలో వాటి ప్రస్తావనలెలా ఉన్నాయి - సాయి సచ్చరిత్రలో స్పృశించని యితర సంఘటనల గురించి చూద్దాం. అప్పుడామె జీవితపు రేఖాచిత్రం-ఆమె అంత్యం వరకు చూడగలం. ఆమె చివరిదశ చాలా కదిలిస్తుంది మనను. ఆమె కడపటి క్షణాలు ప్రశాంతంగా ఉండటమే కాదు. సద్గురు సాయిబాబా ఆమెకప్పుడు స్వయంగా దర్శనమిచ్చి ఆశీర్వదించారు. అంతకన్నా సాయిభక్తుడైన వాడికి కోరుకొనే గొప్ప ఆనందం ఏముంది? అందుచేత ఆమె రుణానుబంధ కథను, ఉపదేశాన్ని గురించి తెలుసుకుందాం.





ఓసారి దాదాసాహెబ్ తన కుటుంబంతో సహా షిరిడీ వచ్చాడు. బాబా ప్రేమలో మునిగిపోయాడు. కపర్దే మామూలు మనిషి కాడు. ఆయన చాలా జ్ఞాని. అయినా - బాబా ముందు శ్రద్ధతో తలవంచేవాడు. ఆయన ఇంగ్లీషు బాగా చదువు కొన్నాడు. సుప్రీమ్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌లోను, స్టేట్ కౌన్సిల్‌లోను, (కేంద్ర విధాన పరిషత్, రాష్ట్ర విధానసభలోను) మంచి గౌరవాదరాలు పొందిన వాడు - తన వాదనాపటిమతో స్టేట్ కౌన్సిల్‌నూ, వాగ్ధాటితో సుప్రీం లెజిస్లేచర్‌ను ఒక ఊపు ఊపిన వాడు. అయినప్పటికీ బాబా ముందు నిశ్శబ్దంగా ఉండేవాడు. బాబాకు అనేక మంది భక్తులున్నారు. వారిలో కపర్దే, గోపాల రావుబూటీ, లక్ష్మణకృష్ణ నూల్కర్లు మాత్రం బాబా ఎదుట పెదవి మెదిపేవారు కాదు. ఇతరులు బాబాతో మాట్లాడే వారు-కొందరు వాదించేవారు - కొందరు తమ బుర్రలోకి ఏది వస్తే అది మాట్లాడేవారు. కానీ, యీ ముగ్గురూ పూర్తి సంయమనాన్ని పాటించేవారు. మాట్లాడటం మాట అటుంచి వాళ్లు సాయిబాబా చెప్పినదాన్ని వెంటనే అంగీకరించేవారు. ఆయన మాటలు వినటంలో వారి నమ్రత, మర్యాద చాలా గొప్పవి. విద్యారణ్యుల పంచదశి విషయాలపై సాధికారికంగా మాట్లాడగల కపర్దే మసీదుకు రాగానే పూర్తిగా నిశ్శబ్దమై పోయేవాడు. మాటల గొప్పదనం ఎంతటిదైనా పవిత్రులు, బ్రహ్మతేజంతో ఉన్న సాయి ముందు దానికి గ్రహణం పట్టిపోతుంది. కపర్దే షిరిడీలో నాలుగు నెలలు, ఆయన భార్య ఏడు నెలలు ఉన్నారు. ఇద్దరిలో ఆనందం పెరుగుతూ వచ్చింది. అతని భార్యకు సాయిపై విశ్వాసం చాలా గొప్పది. ప్రతి రోజూ మసీదుకు నైవేద్యం ఆవిడే తీసుకువెళ్లేది. బాబా ఆ నైవేద్యం స్వీకరించి తింటే తప్ప ఆమె భోజనం చేసేది కాదు. ఆ తరువాతనే ఆమె తన ఆహారం తీసుకునేది. ఆమె దృఢ విశ్వాసాన్ని చూచి, భక్తప్రియుడైన బాబా ప్రేమతో ఆమెకు దారి చూపించారు. గురువుల ఉపదేశ రీతులు అనేకరకాలుగా ఉంటాయి. బాబా పద్ధతి పూర్తిగా విభిన్నమైనది. ఆయన తన కరుణను అలవోకగా వర్షిస్తారు. అది భక్తుల అంతరాంతరాల లోకి ఇంకిపోతుంది. ఒకసారి కపర్దే భార్య ఒక పాత్ర నిండా శిరా-పూరీ, అన్నం,

పప్పు, పాయసం, సాంజా, అప్పడం, కోసుంబరీలు తీసుకువచ్చింది. బాబా ఆత్రంగా తన పీఠం మీద నుండి లేచారు. చేతులు పైకి మడుచుకొని మామూలుగా భోంచేసే దగ్గర కూర్చొని పాత్ర మీది మూత తీసివేసి తినబోతున్నారు. అక్కడ చాలా నివేదనలు ఉన్నాయి. ఈమె తెచ్చిన వాటికంటే విలువైనవి కూడా ఉన్నాయి. వాటిని ఇతర భక్తులు స్వీకరించవలసిందే తప్ప బాబా వాటిని ముట్టనైనా ముట్టరు- చాలాసేపటి వరకు. అలాంటిది ఈమె కెందుకింత ప్రత్యేకత? ఇది లౌకిక మానవుల ప్రవర్తన. అలౌకికమైన యోగుల మనస్సు కూడ ప్రత్యేకతను పాటిస్తుందా? మాధవరావు దేశ్‌పాండే బాబావైపు ఓరగా చూచి, ఆయనిలాంటి వేర్పాట్లు ఎలా చేయగలరో తెలుసుకోవాలనుకున్నాడు. "నువ్వు ఇతరుల నైవేద్యాలన్నిటినీ, వెండిపాత్రల్లో తెచ్చినవి కూడా పట్టించుకోవు-పెట్టేస్తావు. ఈమె నైవేద్యం తేగానే నువ్వు తినటం ప్రారంభించటం విచిత్రంగా ఉంది. గురుదేవా, ఈమె నైవేద్యం నీకెందుకంత రుచిగా ఉందో మాకు తికమకగా ఉంది. ఈ అనుగ్రహం చూపడంలోని మర్మమేమిటి?" అని అడిగాడు. బాబా ఇలా జవాబిచ్చారు - "ఈ ఆహారపు గొప్పతనాన్ని నేనెలా వర్ణించగలను? ఈమె పూర్వజన్మలలో ఒకసారి ఒక ఆవు-ఒక వ్యాపారిది-బాగా పాలిచ్చేది. తర్వాత కొంతకాలం కనబడలేదు. అటుపైన ఒక తోటమాలికి బిడ్డగానూ, ఆ తరువాత ఒక క్షత్రియుని ఇంట్లోనూ పుట్టింది. అటుపైన ఒక వ్యాపారికి భార్య అయింది, తరువాత ఒక బ్రాహ్మణ కుటుంబంలో జన్మించింది, బహుకాలం తరువాత ఇప్పుడు కనిపించింది. ప్రేమతో, సంతోషంతో పెట్టిన ఆహారంలో మరికొంచెం తిని, ఆమెకు సంతృప్తి కలిగించనివ్వండి'' - అలా అంటూ ఆయన తృప్తిగా తిని, చేతులు మూతి కడుక్కొని త్రేన్పుతూ, తన చోటులోకి వచ్చి కూర్చున్నారు. ఆమె (శ్రీమతి కపర్దే) బాబాకు నమస్కారం చేసి పాదసేవ ప్రారంభించింది. ఈ అవకాశాన్ని తీసుకొని బాబా ఆమె క్షేమం గురించి మాట్లాడారు. తర్వాత తన కాళ్లు నొక్కుతున్న ఆమె చేతులు తాను నొక్కసాగారు. భగవంతుడు, భక్తురాలు





ఇలా పరస్పరం సేవ చేసుకోవడం చూచి శ్యామా హాస్యంగా "ఆహా, ఏమీ లీల చూస్తున్నాం? ఈ పరస్పరం విశ్వాసం చూచి మాకు ఆశ్చర్యమవుతుంది!'' అన్నాడు. ఆమె సేవాభావానికి బాబా ఆనందించారు. ఆమెతో మృదువుగా "రాజారాం రాజారాం అను ఈ జపం క్రమంగా స్థిరంగా చేస్తూ ఉండు, నీకు ఆత్మ సంపూర్ణత కలుగుతుంది. నీ మనసు ప్రశాంతమై గొప్ప ప్రయోజనం సిద్ధిస్తుంది'' అన్నారు. ఈ మాటలెంతో శక్తివంతమైనవి. అవి ఒక్క క్షణములో ఆమె గుండెలు చీల్చుకు వెళ్లి ఆధ్యాత్మిక శక్తినిచ్చాయి. సమర్థ సాయినాథులు వినయం గల భక్తుల కోరికలను తీరుస్తూ వారి క్షేమాన్ని కాపాడుతూ ఉండే కరుణాళుడు''.

పై సంఘటన **04-03-1912** నాటి డైరీలో సంక్షిప్తంగా "మా ఆవిడ సాయిబాబాను పూజించడానికి ఆలస్యంగా వెళ్లింది. కానీ ఆయన చాలా దయతో తన భోజనాన్ని కూడా పక్కకుపెట్టి ఆమె పూజను స్వీకరించారు'' అని ఉంది.

ముందరి సాయిలీల పత్రికలలో స్వామీ శరణానంద్‌గారు ఈ సంఘటనను ప్రస్తావిస్తూ "బాబా స్పర్శ ఆయన ఊది ఇచ్చేటప్పుడో పాదాలు, కాళ్లు నొక్కడానికి అనుమతించినపుడో భక్తులకు అనుభవమయ్యేది. కాని ఆయన అందరిని ఒకేలా తాకనిచ్చేవారు కారు. ఎవరికైనా వారు ఉపదేశం ఇవ్వాలను కున్నప్పుడు తనను తాకనిచ్చేవారు. అది కూడా వారి భక్తినీ, భావాన్నీ బట్టే. కొన్నిసార్లు తిరస్కరించే వారు కూడా. మాన్యశ్రీ జి.ఎస్.కపర్దేగారి భార్యకు జపమంత్రం రాజారామ్ బోధించ దలచుకున్నప్పుడు- మధ్యాహ్నం వేళ మసీదులోకి స్త్రీలను రాకుండా నిషేధించే నియమాన్ని ఆయన పట్టించుకోలేదు. ఆమెను రానివ్వడమే కాదు - ఆమె నివేదన తీసుకోవడమే కాదు - తన కాళ్లను ఆమెను నొక్కనిచ్చి, ఆమె చేతులను నొక్కుతూ, "రాజారాం, రాజారాం అని జపిస్తూ ఉండు'' అని ఉపదేశించారు. స్వామి సాయి శరణానందుల యీ వ్యాఖ్యానం వల్ల బాబాకు శ్రీమతి లక్ష్మీబాయి కపర్దే పట్ల ఎంత ఆదరం ఉందో తెలుస్తుంది.

**(సశేషం)**

# గురువుగారితో కబుర్లు

గురువుగారండీ! ... పాదాభివందనం.

గుర్తుండేనా స్వామీ .... మీ సాయిధామం ఆశ్రమంలోని కళ్యాణి ఆడిటోరియంలో సెప్టెంబర్ 4న అమ్మ సంస్మరణ సభ జరిగింది. మీ శిష్యులు, అభిమానులు, భక్తులు ఎందరో మీరు వారి పట్ల చూపించిన వాత్సల్యాన్ని గుర్తు చేసుకొని విలపించారు. మీరూ, అమ్మా లేకుండా కార్యక్రమం జరగటం యిదే ప్రథమం. మీరూ, అమ్మా నేర్పిన విధానముననే అంతా సవ్యంగా జరిగింది. నా మొహం - మీరూ, అమ్మా లేకుండా అని అన్నాను - క్షమించండి - మీ చిత్రపట సమక్షంలోనే జరిగింది.

సెప్టెంబర్ 9న అమ్మ అస్తికలు కాశీ - గంగలో, ప్రయాగ సంగమంలో నిమజ్జనం చేయటానికి ఆనందం మామయ్య, శ్రీమతి జయక్క, శ్రీమతి పద్మక్కలతో బయలుదేరాను. 10వ తేదీన కాశీలో, ప్రయోగలో శాస్త్రోక్తంగా నిమజ్జన కార్యక్రమం జరిగింది. మీరు చెప్పిన కాశీ, ప్రయాగ విశేషాలు మదిలో మెదిలాయి. అప్పడెప్పడో భక్తులతో అమ్మ చెప్పగా విన్నాను - మాతాజీ కాశీ వస్తారా అని భక్తులు అడుగగా .. అమ్మాయీ ... నా గురుదేవులు ఉన్న యీ సాయిధామమే కాశీ పట్టణము, సాయినాథుల వారి పాదోదకమే గంగ నాకు. అయినా మా రాముడు నన్ను (అస్తికలు) కాశీ గంగలో కలుపుతాడుగా, అప్పడు దర్శిస్తాలే అన్ని క్షేత్రాలకు అని. అమ్మ మాట ప్రకారంగానే అన్నీ జరిగినాయి.

అక్టోబర్ 6వ తేదీన ప్రశాంతి నివాసియగు ఎం.వి. మాధవరావుగారు తమ 91వ జన్మదినోత్సవం ఆశ్రమవాసుల మధ్య జరుపుకున్నారు. మీరూ, అమ్మా వారి పట్ల చూపించిన ప్రేమానురాగాలను చెమర్చిన నేత్రాలతో వచ్చిన వారికి, ఆశ్రమవాసులకు తెలియజేసారు. వారికి ఆశ్రమం తరపున





నూతన వస్త్రాలను అందించాము. దసరా సెలవులలో ఆశ్రమ బాలికలం దరూ డా॥ ఝాన్సీగారితో శ్రీ సాయినాథ క్షేత్రం, శ్రీ కోదండ రామ సాయి సన్నిధానం సేవాశ్రమాలు సందర్శించి వచ్చారు. గురుదేవా నాలో ఏదో తెలియని బాధ తొలుస్తుంది. మీరూ, అమ్మా చెప్పిన మాటలే మళ్ళీమళ్ళీ మననం చేస్తున్నాను. మీరు చూపిన మార్గంలోనే నడుస్తూ సాధన కొనసాగిస్తున్నాను. నాలో మనోధైర్యాన్ని నింపరా స్వామీ!.......

**- మీ రాముడు**

# మాతృసంస్థ కబుర్లు

అక్టోబర్ 1వ తేదీ నుండి శ్రీ కోదండ రామ సాయి సన్నిధానం ఆశ్రమం (సత్తెనపల్లి)లో శరన్నవరాత్రుల సందడి మొదలైంది. ప్రతి సంవత్సరం రామాలయంలో పరివేష్ఠితమైన సీతమ్మ వారి ముందు కలశస్థాపన చేయడం, పసుపు గౌరమ్మలను చేసి ప్రతిరోజు ఒక్కొక్క అవతారానికి అమ్మవారికి పూజ చేయడం జరుగుతున్నది. సీతమ్మ వారికి 11 రోజులు కొత్త చీరలతో అలంకరణ చేయడంతో అమ్మవారు దివ్యతేజస్సుతో భక్తులను అలరించారు. 1వ తేదీ కలశస్థాపన తరువాత గ్రామంలోని స్త్రీలు బతుకమ్మని ఏర్పాటుచేసి 11 రోజులు ప్రతిరోజూ సాయంత్రం బతుకమ్మ పూజ చేసుకున్నారు. 12వ తేదీన బతకమ్మను నిమజ్జనం చేశారు.

1వ తేదీ సాయిధామం ఆశ్రమం పిల్లలు మైనేనివారి పాలెం సాయినాథ క్షేత్రం వెళ్ళి రెండు రోజులు ఉండి తిరిగి వచ్చేటప్పడు శ్రీమతి ఝాన్సీగారితోపాటు సత్తెనపల్లి ఆశ్రమానికి వచ్చి ఆ రాత్రి ఉండి తిరిగి మరుసటి రోజు ఉదయం రేపల్లె సికింద్రాబాద్ బండిలో సాయిధామం వెళ్ళారు. ఆశ్రమం పిల్లలు ఎప్పడూ మాతాజీగారితోపాటు వచ్చేవాళ్ళు.

ఈసారి పిల్లలు మాత్రమే రావటం ఏదో వెలితిగానూ, బాధగానూ అనిపించింది. ఆశ్రమమంతా పిల్లలతో సందడిగా మారి వాళ్ళు వెళ్ళిపోయిన తరువాత బోసిగా అనిపించింది.

8వ తేదీ సరస్వతి అమ్మవారి పూజ ఆనంద సాయిప్రభు మందిరంలో ఏర్పాటు చేసాము. సరస్వతి అమ్మవారి పటానికి అలంకారం చేసి పూజారి ప్రేమ్‌కుమార్‌గారు వచ్చిన పిల్లలందరిచేత శాస్త్రోక్తంగా పూజ చేయించారు. పిల్లలందరూ భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజ చేసారు. అమ్మవారికి నివేదించి పెరుగన్నం ప్రసాదం పంచడంతో ఆ కార్యక్రమం ముగిసినది.

12వ తేదీ ఉదయం ఆనందసాయి ప్రభువారికి పంచామృత క్షీరాభిషేక, జలాభిషేకాలు జరిగిన అనంతరం ఆనంద సాయి ప్రభువారికి సహస్ర నామార్చన పూజా కార్యక్రమం జరిగినది. అనంతరం సాయి సచ్చరిత్ర పారాయణ, అనంతరం బాబా వారి సమాధి ఉత్సవం, మహాహారతి, ప్రసాద వితరణ జరిగినది. శ్వేతవస్త్రాలలో బాబావారు దివ్యతేజస్సుతో కనిపించారు. బాబా వారి సమాధిని పూలమాలలతో అలంకరణ చేయడంతో భక్తులను ఎంతో ఆకట్టుకున్నది. సాక్షాత్తు బాబావారే సమాధిలో ఉన్నారనే భావనతో భక్తులు భక్తితో సాయి నామస్మరణతో ప్రదక్షిణలు చేసారు. ప్రసాద వితరణతో యీ కార్యక్రమం ముగిసినది. ఈ కార్యక్రమాలన్నిటి వెనుక పరమపూజ్య గురుదేవుల శక్తి అంతర్లీనంగా ఉండి సాయి ఆశీస్సులతో మమ్ములను ఏ ఆటంకం కలుగకుండా నడిపించినది. ఎన్ని జన్మల పుణ్యఫలమో సాయి పాద సేవా భాగ్యాన్ని మాకు ప్రసాదించిన పరమపూజ్య గురుదేవుల దివ్య పాదాలకు మనస్సులోనే కన్నీటి అభిషేకం చేసి తరించాము.







# క్షణాలతో పందెం వేసి

- భేరి సోమన్న

మొన్ననెప్పుడో పుష్కరాల గురించిన సంభాషణ మిత్రులతో సాగుతున్నపుడు నాకేదో గతస్మృతి చటుక్కున స్ఫురణకు తగిలింది. అసలు పన్నెండు అనే అంకెకు చాలా ప్రాధాన్యాలున్నాయి. మన కాలమానం ప్రకారం పన్నెండు గంటలు పగలు, పన్నెండు గంటలు రాత్రి. జ్యోతిషశాస్త్రంలో రాసులు పన్నెండు. మనకు ద్వాదశ జ్యోతిర్లింగాలున్నాయి. ద్వాదశరుద్రులున్నారు. ద్వాదశ ఆదిత్యులున్నారు. మనకేకాదు-ఏసుక్రీస్తుకు పన్నెండు గురు శిష్యులున్నారని క్రైస్తవ సోదరుల విశ్వాసం. పన్నెండు నెలలు కలిస్తే ఒక సంవత్సరం సంపూర్ణమవుతుంది. మన దేశపు ఆడపడుచులు పుట్టినింటికి వచ్చి పన్నెండేళ్లు దాటితే మాతృబంధం తెగిపోయినట్లేనంటారు పెద్దలు. అలా పన్నెండు పలిపలివిధాల మన జనజీవనంలో చోటు చేసుకొన్నది. ఈ విషయాల మధ్య నాకో జ్ఞాపకం-చాలా పాతదే.

ఎయిర్‌ఫోర్స్ (వైమానిక దళం)లో పనిచేస్తున్నాను అప్పట్లో. ఆఫీసర్స్ సెలెక్షన్‌లో ఎన్నో పరీక్షలుంటాయి. ఒక సమస్య ఏకరువు పెట్టి, కొంత సమయమిచ్చి, పరిష్కారం సూచించమనటం వాటిలో ఒకటి. అలా మాకో సమస్య యిచ్చారు-"ఇక్కడ సైన్యముంది, అల్లంతదూరంలో శత్రుసైన్యముంది. మధ్యలో నది ఉంది. మన సైన్యం శత్రుసైన్యం మీద దాడిచేసి, ఆ స్థావరాన్ని పట్టుకోవాలి. దీనికో పటిష్ఠమైన ప్రణాళిక తయారుచేసి ప్రదర్శించండి. అందుకు మీకు చాలా సమయం కావలసి ఉంటుందని నాకు తెలుసు. అంచేతనే ఎక్కువ సమయం యిస్తున్నాను - పన్నెండు నిమిషాలు - సుదీర్ఘమైన పన్నెండు నిమిషాలు" అన్నారు ఆఫీసర్. "మీరు అంత సమయం కూడా తీసుకోరు" అని కూడా అన్నారు. అంతే - మా బుర్రలు శరవేగంతో పనిచేసాయి. మాకు తోచిన పద్ధతిలో పరిష్కారం సూచించి, ప్రదర్శించి చూపాము. ఆఫీసర్‌తో "భేష్" అనిపించుకున్నాం కూడా. అది ఒక తీపిగుర్తు మాకు.

# బాలవాణీ

అనగనగా ఒక ఊరిలో ఒక పేద కుటుంబం నివసిస్తూ ఉంది. ఆ దంపతులకు ఒక్కడే అబ్బాయి. ఎంతో బుద్ధిమంతుడు. ఇంట్లో అన్ని పనులలో తల్లిదండ్రులకు ఎంతో సహాయం చేస్తూ చదువుకుంటున్నాడు. బడిలో ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు ఎంతో ఏకాగ్రతతో వినేవాడు-ఎంతో బుద్ధిమంతుడు అనే పేరు తెచ్చుకున్నాడు ఉపాధ్యాయులతో. ఏ రోజు పని ఆ రోజే పూర్తి చేయటం, ప్రతి పనిని ఎంతో చక్కగా చేయటం, అందరితో కలిసిమెలసి ఉండటం వల్ల గ్రామంలో పిల్లలందరికీ యితనంటే ఎంతో యిష్టం. అయ్యో, అబ్బాయి పేరు చెప్పటం మరిచాను కదా! వాడి పేరు భరత్. ఆటపాటలలో అన్నింటిలో ముందుండేవాడు. వారి పూరిగుడిసె చుట్టూ పూలమొక్కలు, అరటిమొక్కలు, చిన్నచిన్న ఆకుకూరలు కూడా పెంచేవాడు. తోటలో పూసే పూలు ప్రక్కనే ఉన్న రామాలయంలో పూజారి గారికి యిచ్చి, పూజానంతరం ఆయన చెప్పే రామాయణంలోని సన్నివేశాలను జాగ్రత్తగా విని అర్థం చేసుకుంటూ ప్రసాదం తీసుకుని యింటికి పరుగెత్తుకు వచ్చి, తల్లిదండ్రులకు పెట్టికానీ తినేవాడు కాదు. అలా తల్లిదండ్రులు చెప్పే మంచిమాటలు వింటూ పెరిగి పెద్దవాడయ్యాడు భరత్. ప్రతి క్లాసులో తనదే ఫస్టుర్యాంక్. అన్ని క్లాసులలో కష్టపడి చదవటం వలన తన కల అయిన ఐ.ఎ.ఎస్. పాసై కలెక్టర్ అయ్యాడు. తాను చిన్ననాటి నుండి నేర్చుకున్న మంచి అలవాట్ల వల్ల తను చిన్నతనంలో పడ్డ కష్టాల వల్ల నేర్చుకున్న పాఠాలు తన ప్రజలు పడకూడదని మంచి పథకాలు పెట్టి మంచి కలెక్టర్‌గా పేరు తెచ్చుకోవటమే కాదు, ఆదర్శ కలెక్టర్‌గా అవార్డు కూడా అందుకున్నాడు. అతను ఒక సభలో మాట్లాడుతూ తాను చిన్ననాడు విన్న రామాయణ, భారత, భాగవతంలో విన్న పాత్రలు, అవి బోధించిన మంచి విషయాలు తెలుసుకోవటం వలననే యీ రోజు యీ భరత్‌కు యీ అవార్డులు, అభినందనలు వచ్చాయి కాబట్టి ప్రతివారూ వాటిని తప్పకుండా విని ఆచరించాలని సభకు విన్నవించుకున్నాడు.

మరి మనం కూడా ఆచరిద్దామా............





# జ్ఞానుల మనస్సు బ్రహ్మమే

– శ్రీ రమణాశ్రమ లేఖలు నుండి

ఈ ఉదయం ఏడున్నర గంటలకు వెళ్లాను. హాలంతా నిశ్శబ్దంగా ఉన్నది. అగరువత్తుల ధూపం కిటికీలలో నుండి బహిర్గతమై, నూతనాగతులగు పాంథులకు భగవాన్ ఇక్కడే ఉన్నారని తెలియజేస్తూ ఉన్నది. లోపలికి వెళ్లి నమస్కరించి కూర్చున్నాను. బాలీసు నానుకొని పడుకున్న భగవాన్ లేచి, పద్మాసనస్థులై కూర్చున్నారు. క్షణంలో, వారి దృష్టి అచంచలమై ప్రకాశిస్తూ, హాలంతా వింత కాంతితో నింపింది. అనిమేష నయనాలతో, ఆ మహాభాగుని చూస్తూ మైమరచి కూర్చున్నాను. ఉన్నట్లుండి ఒకరు "స్వామీ, జ్ఞానులకు మనస్సు ఉన్నదా? లేదా?" అని అడిగారు.

భగవాన్ ప్రసన్న దృష్టితో వారివైపు చూచి "మనస్సు లేనిదే బ్రహ్మమును తెలుసుకొనుట అనేది ఉండదు. మనస్సంటూ ఉంటేనే తెలుసుకొనుట అనేది ఉన్నది. మనస్సు ఒక ఉపాధి నాశ్రయించి యుంటుందిగానీ, ఉపాధిలేనిదే మనస్సు లేదు. ఉపాధిని నిర్దేశించిగదా జ్ఞాని అని చెప్పగలం? ఉపాధి లేకుంటే ఇతడు జ్ఞాని అని అనడం ఎట్లా? అయితే, మనస్సే లేనిది ఉపాధి ఏ విధంగా పనిచేస్తుంది? చేయదు. అందువల్ల, జ్ఞాని యొక్క మనస్సు బ్రహ్మమని చెప్పబడుతుంది. జ్ఞాని సదా బ్రహ్మమునే చూస్తుంటాడు. మనస్సే లేనిదే చూడటం లేదు గదా? అందుకే, జ్ఞానుల మనస్సు బ్రహ్మాకారంగా ఉంటుందని చెపుతారు. వాస్తవానికి వారి మనస్సే బ్రహ్మము. అజ్ఞానికి, బ్రహ్మములోనే తానున్నప్పటికీ అది తోచక, వెలివృత్తులే గోచరించినట్లు, జ్ఞానికి శరీరం వెలివృత్తుల్లో వర్తించినా, బ్రహ్మమే సదా గోచరిస్తుంది. ఆ బ్రహ్మము అంతటా నిండి ఉన్నదే. ఆ బ్రహ్మములో లీనమైన వెనుక, బ్రహ్మాకారమైన మనస్సనటం, సముద్రాకార నది అన్నట్లుంటుంది. నదులన్నీ సాగరంలో చేరిన వెనుక ఒకే జలమయం గదా! అందులో,

ఇది గంగ, అది గౌతమి, ఇది అంత వెడల్పు, అది అంత పొడుగు అని, నిర్ణయించగలమా? అట్లాగే ఇదీను" అన్నారు.

"సత్యమే బ్రహ్మం, రజ స్తమో గుణాలు ఆభాస అంటారే? అన్నారింకొకరు. "అవును, సత్తే ఉన్నది. సత్తే సత్యం. అది స్వాభావికమైనది. అతిసూక్ష్మమైన మనస్సంచరణమే రజస్తమోగుణసంపర్కం వల్ల ఇన్నిరకాలలోకాన్ని సృష్టిస్తుంది. రజస్తమో గుణసంపర్కం వల్లనే ఆభాసమైన జగత్తు చూచి మనస్సు భ్రాంతి చెందుతుంది. ఆ సంపర్కం తోసివేస్తే సత్త్వం స్వచ్ఛంగా ప్రకాశిస్తుంది. దాన్నే శుద్ధసత్త్వమంటారు. బహుసూక్ష్మమైన మనస్సుతో విచారించి తోసివేస్తే గాని, ఈ సంపర్కం పోదు. వాసనలన్నీ అణగి అతిసూక్ష్మం కావాలి మనస్సు సూక్ష్మాతి సూక్ష్మమన్నమాట. "అణోరణీయాన్" అన్నారు. అణువుకు అణువుగా కావాలి. అణువుకు అణువై అణిగితే "మహతో మహీయాన్" మహత్తుకు మహత్తుగా లేస్తుందట తానే. అది చూడటమో పొందటమో, ఏదో అనుకోండి. ఏమనుకున్నా సరే. నిద్రపోతాము. మనస్సు, సర్వవృత్తులతో హృదయమం దణగుతుంది. అప్పడేం కనబడుతుంది! ఏమీ లేదు. ఎందువల్ల? మన స్సణిగినందువల్ల. లేస్తాము. ఆ లేచిందే మనస్సూ, సత్తూ, బ్రహ్మమూను. ఆ లేచిన మనస్సు గుణాలతో కూడిన వెంటనే సమస్తం తోస్తుంది. ఆ గుణవికారాలు తోసివేస్తే "అహమహ" మని తానుగ ప్రకాశిస్తూ, సర్వత్రా బ్రహ్మమే గోచరిస్తుంది. అప్పడు అంతా తన్మయంగా గోచరిస్తుంది. వేదాంత పరిభాషలో చూడండి. బ్రహ్మవిత్, బ్రహ్మవిద్వరిష్ఠ, ఇత్యాదులన్నీ చెప్పి, బ్రహ్మైవ భవతి - బ్రహ్మమే తాను అన్నారు చివరకు. అందువల్ల, జ్ఞానుల మనస్సే బ్రహ్మము" అన్నారు భగవాన్.

"జ్ఞాని అన్నిటియందు సమతతో వర్తిస్తాడంటారు గదా?" అన్నారింకొకరు. "అవును వర్తించుటయేమి, మైత్రి, కరుణ, ముదిత ఉపేక్షాది భావాలు వారికి సహజంగా వుంటవి. "ఉత్తములందు ప్రియం, దీనులందు కరుణ, సత్కార్యాచరణమన్న సంతోషం, దుష్టులందు ఉపేక్ష ఇత్యాదులు వారికి సహజలక్షణం" అన్నారు భగవాన్.







భక్త కథా సుధ

# సమర్థ రామదాసస్వామి–1

– ప్రభుజీ

అధర్మము ప్రబలిపోయి లోకం అల్లకల్లోలమైపోతున్నప్పడు ధర్మపరుల ప్రార్థనలు మన్నించి ఆర్తత్రాణుడైన ఆ పరమాత్ముడు మహాయోగుల రూపంలో తన శక్తిని యీ లోకంలోకి పంపించి ధర్మస్థాపన చేస్తాడు.

అదుగో అలాంటి క్లిష్టపరిస్థితే 17వ శతాబ్దంలో ఏర్పడింది. సనాతన కాలం నుంచీ పరంపరాగతంగా భారతదేశంలో అనుసరింపబడుతున్న ధర్మానికి పెద్ద దెబ్బ తగిలింది. మతం ముసుగులో రాజ్యవ్యాప్తి చేసుకుంటూ ధర్మనాశనానికి ఒడిగట్టిన ఔరంగజేబు పరిపాలనాకాలం అది. రాజ్యకాంక్షతో కన్నతండ్రినే బంధించి, రక్తం పంచుకు పుట్టిన సోదరుల్ని నిర్దాక్షిణ్యంగా చంపి భారతదేశమంతటా తన పరిపాలనను వ్యాపింప జేయటానికి ప్రయత్నిస్తున్న రోజులవి.

'యథారాజా తథాప్రజా' రాజునుబట్టి ప్రజలు. న్యాయం ధర్మం పాతకాలపు మాటలైనై. పచ్చి స్వార్థం రాజ్యమేలుతోంది. తమ లాభం కోసం ఎంతటి దుర్మార్గానికైనా ప్రజలు సిద్ధపడుతున్నారు. దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా వారే ధర్మపన్నాలు చెబుతున్నారు. అమాయకులూ ధర్మాత్ములూ నానా అగచాట్లకు గురవుతున్నారు. బలహీనులు మాత్రం 'బతికుంటే బలుసాకు తినవచ్చని' ధర్మభ్రష్టులు కావటానికి సిద్ధపడుతున్నారు. ఎదిరించిన వారు నరికివేయబడుతున్నారు. దరిద్రులు దుర్మార్గానికి పాలుపడుతున్నారు. దారిదోపిడీలు, దొంగతనాలు, హత్యలు సర్వసాధారణమైపోయినై. మానవుడికి తన పట్ల, భగవతుని పట్ల, దివ్యమైన తన వారసత్వం పట్ల విశ్వాసాన్ని పెంచే సంస్కార కేంద్రాలైన తీర్థాలు, క్షేత్రాలు భ్రష్టుపట్టించబడ్డాయి.

ఒకానొక మహాపురుషుని జన్మకు యిది అవసర సమయం. ఆంధ్ర దేశం నుండి ఒకానొకప్పుడు మహారాష్ట్ర దేశానికి వలస వచ్చిన కృష్ణాజీ పంతులుగారి వంశంలో జన్మించిన సూర్యాజీ పంతు 'జాంబు' అనే గ్రామానికి కరణంగానూ, పురోహితునిగానూ పనిచేస్తున్నాడు. ఆ గ్రామం మహారాష్ట్ర దేశంలో పవిత్ర గోదావరీ తీరంలో ఉంది. పూర్వ పుణ్య వశాన సూర్యాజీకి నిష్కామ కర్మయోగం పట్టుబడింది. కష్టసుఖాలను సమంగా స్వీకరిస్తూ దొరికిన దానితో తృప్తి పడుతూ, దరిజేరిన వారికి చేతనైనంత సాయం చేస్తూ కీర్తిప్రతిష్ఠలు సంపాదించాడు. వంశ పారంపర్యంగా అతనికి సూర్యోపాసన లభించింది. చుట్టుప్రక్కల జనానికి గురుత్వం వహిస్తూ స్వార్థాన్ని మరచి పదార్థానికే పాటుపడుతుండేవాడు. అతని భార్య రాణూబాయి సూర్యాజీకి తగిన యిల్లాలు. ఆ పుణ్యదంపతులకు చాలాకాలం వరకు సంతానం కలుగలేదు. వారు ఆ కాలంలో పేరుమోసిన గొప్ప భక్తుడు కవి అయిన ఏకనాథస్వామి దర్శనానికి వెళుతుండేవారు. వీరే మరాఠీ భాషలో ఏకనాథ భాగవతము, భావార్థ రామాయణము వ్రాసింది. రాణూబాయి వారికి నమస్కరించినప్పుడల్లా ఆమెకు యిద్దరు లోకోత్తర పురుషులు పుట్టబోతున్నారని భవిష్యత్తును పలికేవారు. ఏ చింతలూ పెట్టుకోక సూర్యాజీ తన సూర్యోపాసనని కొనసాగిస్తున్నాడు. క్రమంగా అతడి ఉపసనాబలం పెరిగింది. సూర్యభగవానుడే కరుణించినట్లుగా వారికొక కొడుకు పుట్టాడు. గంగాధరుడని పేరు పెట్టి అల్లారుముద్దుగా పెంచుకుంటున్నారు. మూడేళ్ల తరువాత రాణూబాయి మళ్ళీ గర్భవతి అయింది. ఆ స్థితిలో ఆమె ఏకనాథుని దర్శించగా వారు హఠాత్తుగా ఆమెకు నమస్కరించారు. పుట్టబోయే శిశువు మహనీయతను ఆనాడే గుర్తించవచ్చు.

చైత్ర శుద్ధ నవమినాడు దేశంలో అలుముకొన్న చీకటిని పారద్రోల గల ఒకానొక గొప్ప వెలుగు. రాణూబాయికి జన్మించింది. ఆ కుమారునికి 'నారాయణు'డని పేరు పెట్టాడు సూర్యాజీ.





నారాయణుని చిన్నతనపు అల్లరి ఆ ఊరివాళ్లను కాస్త యిబ్బంది పెట్టినా గౌరవనీయుడైన అతని తండ్రిని చూచీ ఆ బాలుని అసాధారణ ప్రజ్ఞను చూచీ వాళ్ళు సహించి ఊరుకొనేవాళ్ళు. తీరిక సమయాల్లో తల్లి చెప్పే రామాయణ గాథలంటే నారాయణునికి చాలా యిష్టం. రామ భక్తాగ్ర గణ్యుడు, నిస్వార్థ సేవాతత్పరుడు "హనుమ" అంటే అతనికి ఎక్కడలేని యిష్టం ఏర్పడింది. పసితనంలో పడ్డ బీజాలు వ్యక్తుల జీవితాల్ని ఎంతగా ప్రభావితం చేస్తాయో చూశారా! తాను గూడా హనుమంతుని మాదిరిగా రామభక్తుడై ఘనకార్యాలు సాధించాలనుకొన్నాడు. అప్పటికి అతని వయస్సు ఐదేళ్ళు. ఒకనాడు తల్లితో కలసి గోదావరీ తీరానికి వెళ్ళాడు. ఆమె నదిలో బట్టలు ఉతుకుతున్నది. ఒక రాతి మీద నిలబడి రాత్రి అమ్మ వినిపించిన కథను గుర్తుకు తెచ్చుకుంటున్నాడు. ఆంజనేయుడు నూరు యోజనాల సముద్రాన్ని లంఘించి లంకకు చేరాడు. రామనామం చేయటం వల్లే అతనికాశక్తి వచ్చిందని అమ్మ చెప్పింది. రామనామంతో తాను మాత్రం యీ నదిని దాటలేనా అనుకున్నాడు ఆ చిన్నారి నారాయణ. రామ్ రామ్ అంటూ కుప్పించి దూకి తన ముందున్న యింకో రాతిమీద పడ్డాడు. తల బొప్పి కట్టింది. తల్లి లేవదీసి తల నిమురుతూ 'ఎందుకు పడ్డావు నాయనా! అని అడిగింది. విషయం విని ప్రేమతో చెప్పింది రాణూబాయి' దానికి. చాలా నమ్మకంతో చాలాకాలం జపం చెయ్యాలని. ఒక రకంగా అదే అతనికి ఉపదేశంగా పనిచేసింది.

బడిలో వేశారు, ఐనా కోతిచేష్టలు మాత్రం మానలేదు. బడి ఎగగొట్టి పిల్లల్ని వెంటేసుకుని కోతి కొమ్మచ్చిలు ఆడేవాడు. ఉపాధ్యాయుడు గద్దించి నప్పడు పాఠాలన్నీ గడగడ అప్పగించేవాడు. అతనే కాదు తోటి విద్యార్థులకు కూడా ఈతని సాహచర్యం వల్ల ఆ శక్తి అబ్బేది. నారాయణుని అల్లరిచేష్టల్ని చూసి అంతా కోతి అనేవారు. పెరిగి పెద్దవాడై చరిత్ర మార్గాన్నే మళ్ళిస్తున్నప్పడు జాతి యావత్తూ అతనిని హనుమదవతారంగా మన్నించింది.

**(సశేషం)**